# మగ మనసు

'ఎక్స్‌క్యూజ్ మి!'

రైలు కిటికీలోంచి చీకటిలోకి చూస్తున్న మాణిక్యా రావు తల త్రిప్పి చూశాడు. తన ఎదురుగా కిటికి ప్రక్కనే కూర్చున్న ఆ అమ్మాయి తనవంకే చూస్తోంది. అతను ఆశ్చర్యం నుండి తేరుకోకమునుపే ఆ అమ్మాయి "కాస్త ఆ కిటికీ కూడా మూసేస్తారా?... చాలచలిగా ఉంది' అంది చలి వేస్తున్నట్టుగా వణుకుతూ, అభినయిస్తూ.

మాణిక్యరావు ఒక్క క్షణం ఆమెవంక చూసి చిరునవ్వు నవ్వేస్తూ కిటికి గాజు తలుపు మూసేశాడు.

ఆ అమ్మాయి తేలికగా నిట్టూర్చి 'చాలా థాంక్స్అండీ' అని తన చేతిలోని పుస్తకంలోకి తల దూర్చేసింది.

మాణిక్యరావు ఒక్కసారి కంపార్టుమెంటంతా పరికించి చూశాడు. అందరూ కునికిపాట్లు పడుతున్నారు. అతనికి విసుగనిపించింది. తన ఎదురుగా ఉన్న అమ్మాయి తనతో మాట్లాడితే బావుణ్ణు అనుకున్నాడు. ఆ అమ్మాయి ఎంతో సాధారణమైన అలంకరణతో చాల అందంగా ఉంది. చిన్న పిల్లల్ని చూస్తే బుగ్గలుపిండి ముద్దు పెట్టుకోవాలనిపిస్తుంది- అలానే అనిపిస్తుంది ఆ అమ్మాయిని చూస్తుంటే. అందుకు కారణం సున్నాలా చుట్టుకుని ఉన్న ఎర్రని పెదాల అతు చిన్ని నోరే కావచ్చు.

మాణిక్యరావు ఆమె వంక అలా పరవశంగా చూస్తూ కూర్చున్నాడు. ఆమె చెక్కిలి క్రింద ఎడమచేయి ఆనించి కుడి చేత్తో ఒళ్ళోని పుస్తకం పట్టుకుని చదువుతోంది. మధ్యలో ఒకటి రెండు సార్లు మాణిక్యరావు వైపు చూసింది. అతను ఇందాకటి నుండీ రెప్పవాల్చకుండా ఆమెనే చూస్తుండడం వల్ల ఆమె తనవంక చూడగానే తడబడ్డాడు.

తను అలా రెప్ప వాల్చకుండా ఒక ఆడ కూతురు వైపు చూడడం (ఆమె తను చూస్తున్నట్టు గమనించిన తరువాత కూడా) అంత మర్యాద కాదని భావించి అతను పై బెర్తులో గురక బెట్టి నిద్రపోతున్న ఒక లావుపాటి పెద్దాయన వంక చూస్తూకూర్చున్నాడు. గురక పెడుతున్నప్పుడు అతని పెదాలు గమ్మత్తుగా అదురుతున్నాయి అతను తొడుక్కున్న బనీనులోంచి పెద్ద బానలాంటి పొట్ట వికృతంగా బయటికి పొడుచుకు వచ్చింది. మాణిక్యరావుకు విసుగుపుట్టింది. సూట్ కేసులోంచి తను తెచ్చుకున్న పుస్తకం తీసుకుని చదవడం మొదలు పెట్టాడు.

మాణిక్యరావు హైదరాబాదులో అకౌంటెంటు జనరల్ ఆఫీసులో పని చేస్తున్నాడు. అతని స్వంత ఊరు విశాఖపట్నం. అతని బాల్యం, హైస్కూల్ చదువూ, కాలేజీ చదువూ ఆ ఊళ్ళోనే జరిగిపోయాయి. ఉద్యోగం హైదరాబాదులో వస్తే అక్కడికి మకాం ఎత్తివేయాల్సి వచ్చింది. హైదరాబాదులో ఒకగది తీసుకొని తనే వంట చేసుకుని తింటూ కాలక్షేపం చేస్తున్నాడు. ఒక ఏడాదినుండి అతని తల్లిదండ్రులు అతని కోసం సంబంధాలు వెతకడం

మొదలుపెట్టారు. అడపా దడపా మాణిక్యారావు ఆఫీసుకు శలవుపెట్టి పెళ్ళిచూపులకు వెళ్ళుతున్నాడు-వస్తున్నాడు.

మాణిక్యారావు శలవుపెట్టి వాళ్ళ ఊరు వెళ్ళాడు అంటే పెళ్ళి చూపులకనే లెక్క. అతనికి ఇంతవరకు ఎవ్వరూ నచ్చలేదు. తన ఊహల్లోని మనిషికీ ఆ అమ్మాయిలకీ ఏ విషయంలోనూ అతనికి పోలిక కనిపించలేదు. ఈనాడు రైల్లో తన ఎదురుగా ఉన్న ఆ అమ్మాయిని చూసిన మొదటి క్షణంలోనే మాణిక్యారావు అనుకున్నాడు, తన ఊహల్లోని అమ్మాయి ఆమేనని. పెళ్ళి చూపుల్లో ఇటువంటి అమ్మాయి తడస్థపడుతుందా?...

నిజంగా ఇటువంటి అమ్మాయే భార్యగా దొరకాలంటే ఎంత అదృష్టవంతుడై ఉండాలి?... తనకు అదృష్టం ఉందో లేదో? ! !

మనసునిండా ఆలోచనలు ముసురుకుని ఉండడం వల్ల అతనేం చదువుతున్నాడో అతనికే తెలియడంలేదు. పుస్తకాన్ని మూసేసి ప్రక్కన పెట్టాడు. ఆ అవకాశం కోసమే చాల చాలసేపటినుండి కాచుకుని ఉన్నట్లు ఆ అమ్మాయి చెయ్యి ముందుకు చాపుతూ "అది గోపీచంద్‌గారి పుస్తకమే కదండీ" అంది.

"అవును...చదువుతారా?" అంటూ పుస్తకాన్ని ఆమెకు అందించాడు మాణిక్యారావు.

'ఓహ్!... మెరుపుల మరకలు! !... ఈ నవలంటే నాకెంతో యిష్టమండీ... ఇదివరకోసారి చదివాను... అయినా

మళ్ళీమళ్ళీ చదవాలని అనిపిస్తుంది... మీరు చదివారా? !... ఎంతో కుతూహాలంగా అడిగిందామె.

'అబ్బే ఇంకా లేదండీ... ఇప్పుడే స్టాల్లో కొన్నాను.'

ఆమె ఎంత ఉత్సాహంగా అడిగిందో ఈయనంత నిరుత్సాహంగా జవాబుచెప్పాడు. తను అపుస్తకం చదివిఉంటే ఆమె తప్పకుండా తనతో అపుస్తకం గురించి చర్చించి ఉండేది. తనకా అవకాశం లేకుండా పోయింది.

"పోనీ యిప్పుడు చదవండీ......"అంటూ పుస్తకం ఇవ్వబోయింది.

అబ్బే... నాకు చదవ బుద్ధి కావడంలేదు.

"ఈ పుస్తకం చదవడం మొదలు బెట్టి చూడండి...చివరి వరకూ ఆపకుండా చదివేస్తారు" అంది అందంగా నవ్వుతూ.

"అబ్బే...ఇప్పుడు నాకే పుస్తకాలూ చదవబుద్ధికావడం లేదండీ...ఏం చెయ్యాలన్నా విసుగ్గా ఉంది...అసలే ఒంటరి ప్రయాణంకదా..."

"నా పరిస్థితి కూడా ఇందాకటినుండి అలానే ఉందండీ మాట్లాడడానికి ఎవరూ దొరకలేదు... పోన్లెండి... ఇప్పుడూ మీరు దొరికేరుగా..." అంది మెరసేకళ్ళతో.

ఆమె చొరవకు మాణిక్యరావు ఆశ్చర్యపోయాడు.

"మీరు ఎక్కడిదాకా వెళతారు ?"

"విశాఖపట్నం!" ఆమె జవాబు చెప్పింది.

''నేను కూడా విశాఖపట్నం దాకా వస్తున్నాను''

''ఆ!... మీరు కూడా విశాఖ దాకా వస్తున్నారా? హమ్మయ్య!...అంతవరకూ నాకు కంపెనీ దొరికిందన్నమాట'' అందామె చాల సంతోషంగా.

''మీరు హైదరాబాదులో ఉంటారా?''

''అబ్బె...లేదండీ...మా స్వంత ఊరు విశాఖపట్నమే... హైదరాబాదులో మా అక్కయ్య ఉంటుంది... ఎట్లాగూ కాలేజీ శెలవులుకదా... ఎంజాయ్ చేద్దామని హైదరాబాదు వచ్చాను. వచ్చి ఒకవారం అయినా అయిందో లేదో...ఇంటి దగ్గరనుండి వెంటనే రమ్మని ఉత్తరం వచ్చింది...ఏదో వెధవ పని తగిలింది లెండి...అందుకని''

ఆమె ముఖం చిట్లించింది. అయినా ఆమె అందంగానే ఉందని అనుకున్నాడు మాణిక్యరావు.

''అన్నట్లు మీ సంగతి?''

''నేను ప్రస్తుతం ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటున్నాను... మా స్వంత ఊరుకూడా విశాఖపట్నమే... మా అమ్మా నాన్నాకూడా అక్కడే ఉన్నారు. ఓ ముఖ్యమైన పనిమీద వెళ్తున్నాను''

''మీరు విశాఖపట్నంలో ఉండే దెక్కడ?''

మాణిక్యరావు చెప్పాడు. ఆమె తాను ఎక్కడ ఉంటుందో చెప్పింది.

''అన్నట్లు నా మతిమండా ... ఇంతవరకూ మీ పేరే

తెలుసుకోలేదు...చూశారా?" అంది నెత్తిమీద చేత్తో కొట్టు కుంటూ.

మాణిక్యరావు తన పేరు చెప్పాడు. ఆమె తన పేరు సుమిత్ర అని చెప్పింది. ఇద్దరూ రెండు గంటలసేపు ఆమాటా ఈమాటా మాట్లాడుకున్నారు.

"ఇక మీరు రెస్టు తీసుకోండి...అలసిపోతున్నట్టున్నారు. కళ్ళుకూడా ఎర్రబారుతున్నాయి" అన్నాడు మాణిక్యరావు చేతి గడియారం వంక చూస్తూ.

"మీతో మాట్లాడితే అలసట ఎక్కడ ఉంటుందండీ..." అంది సుమిత్ర ఓరగా అదోమాదిరిగా చూస్తూ.

మాణిక్యరావు నరాలు జివ్వుమన్నాయి. ప్రయత్నించి ఒక చిరునవ్వు నవ్వి "థాంక్యూ ఫర్ ది కాంప్లిమెంట్" అని అన్నాడు.

"మీ కళ్ళుకూడా ఎర్రగా ఉన్నాయి...నిద్ర వస్తోంది కాబోలు...కాస్త రెస్టు తీసుకోండి" అని వెనక్కి జారబడి కళ్ళు మూసుకుంది సుమిత్ర.

మాణిక్యరావు కాస్సేపు ఆమె అందాన్ని తనివితీరా చూసి తనుకూడా సీటు వెనక్కు జారబడి కళ్ళు మూసు కున్నాడు. కొద్దిసేపటికి నెమ్మ నెమ్మదిగా నిద్ర అతని కళ్ళను బరువుగా క్రమ్మేసింది.

అతనికి మెలకువ వచ్చేసరికి సుమిత్ర మెత్తని ఎడమ పాదం అతని కుడిపాదంమీద ఉంది. ఆమె స్పర్శ అతనిలో విద్యుత్ ప్రవహింప జేసింది. చెదిరిన ఆమె పైట గుప్తమైన

అందాలను ప్రదర్శిస్తూంది. మాణిక్యరావు శ్వాస బరువెక్కింది. అతనిలోని నిగ్రహం సడలింది. నెమ్మదిగా తన ఎడమ పాదాన్ని ఆమె కుడిపాదంమీద పెట్టాడు. ఆమె కళ్ళు తెరిచింది. మాణిక్యరావు తపీమని కళ్ళు మూసుకుని నిద్రపోతున్నట్టుగా నటించాడు. సుమిత్ర తన పాదాన్ని అతని పాదంమీదనుండి తియ్యడంగానీ, అతని పాదం క్రిందనుండి తన పాదం తీసుకోవడంగానీ చెయ్యలేదు. ఆమె తనను కోరుకుంటుందని మాణిక్యరావు గ్రహించాడు సుమిత్ర పాదాల్లోంచి అతని పాదాల్లోకి అక్కడినుండి అతని మెదడులోకి చలిలా జివ్వున విద్యుత్తు ప్రవహిస్తోంది.

మెలుకువగా ఉన్నా తన పాదం తీసుకోలేదంటే ఏమన్న మాట?... మాణిక్యరావుకు సీటులోంచి లేచి సుమిత్రను గట్టిగా కౌగలించుకోవాలనిపించింది. శరీరంతోబాటు అతని బుర్రకూడా వేడెక్కిపోయింది.

అతనీ అవస్థలో ఉండగా తెలతెల్లగా తెల్లవారింది. విజయవాడ స్టేషను వచ్చింది. మాణిక్యరావు సుమిత్ర ఇద్దరూ ఒకేసారి కళ్ళు తెరిచి ఒక్కసారిగా ఒకరినొకరు చూసుకున్నారు.

"ఓహ్...ఐయామ్ సారీ!..." అంటూ సుమిత్ర తన కాళ్ళను వెనక్కుతీసుకుంది.

విజయవాడలో మాణిక్యరావు ప్రక్కన కూర్చున్నాయన దిగిపోయాడు.

"థాంక్ గాడ్...మీ ప్రక్కసీటు దొరికింది" అంటూ

అమితమైన సంతోషాన్ని ప్రదర్శిస్తూ సుమిత్ర ఎదురు సీటు లోంచి మాణిక్యరావు ప్రక్క సీటులోకి వచ్చి కూర్చుంది.

విజయవాడ స్టేషనులో రైలు అర్ధగంట పైనే నిలబడుతుంది. ప్రయాణీకులందరూ ముఖాలు కడుక్కుని కాఫీ ఫలహారాలు సేవిస్తున్నారు. మాణిక్యరావు సుమిత్రలు కూడా ముఖాలు కడుక్కున్నారు.

"మీకు ఏం టిఫిను తెమ్మంటారు?" అని అడిగాడు మాణిక్యరావు.

"ఏం...నేనేమైన బొమ్మను అనుకున్నారా?...పదండి నేనుకూడా రైలుదిగి మీతో వస్తాను" అంటూ బుంగమూతి పెట్టి లేని కోపం ప్రదర్శించింది సుమిత్ర.

మాణిక్యరావు నవ్వేసి ముందుకు అడుగులు వేశాడు సుమిత్ర అతన్ని అనుసరించింది.

ఇద్దరూ రైల్వే కేంటీనులో ఫలహారం ముగించుకుని బయటపడ్డారు. ప్లాట్ ఫారంమీద నడుస్తుండగా మాణిక్యరావు చటుక్కున సుమిత్ర చెయ్యిపట్టుకుని ప్రక్కకు లాగేడు. సుమిత్ర తూలి మాణిక్యరావు గుండెలమీద ఒరిగింది.

"కాస్త చూసుకుని నడవలేవూ?..." అన్నాడు ఆమెమీద అధికారం చెలాయిస్తూ, ఏకవచన ప్రయోగం చేస్తూ.

సుమిత్ర ప్రక్కనుండి ఒక తోపుడుబండిలో మోపెడు సామాను పెట్టి తయ్యిమంటూ ఒక కూలీ తోసుకుపోయేడు.

"థాంక్యూ!..." అంది సుమిత్ర సిగ్గుపడుతూ.

మాణిక్యారావు ఆమె చేతిని వదిలేసి తమ కంపార్టుమెంటు వైపు అడుగులు వేశాడు. సుమిత్ర ముసిముసిగా నవ్వుతూ అతన్ని అనుసరించింది.

విజయవాడ స్టేషనులో చాలమంది ప్రయాణీకులు ఎక్కారు. అంతవరకూ మాణిక్యారావు ఉన్న కంపార్టుమెంటు ఖాళీగానే వుండేది ఇప్పుడు ఆ కంపార్టుమెంటంతా జనంతో నిండిపోయారు. ఎవరో ఒక ముసలాయన కాస్త కూర్చోడానికి స్థలం ఇవ్వమని అడగడంతో మాణిక్యారావు కూర్చున్న బెంచీ మీద అతనికి కూర్చోడానికి స్థలం ఇచ్చారు. ముగ్గురు కూర్చో వలసిన స్థలంలో ఐదుగురు సర్దుకుని కూర్చోవడం వల్ల అందరూ దగ్గర దగ్గరగా కూర్చోవలసి వచ్చింది. మరొకప్పుడైతే రిజర్వేషను చేయించుకోకుండా రైలు ఎక్కినందుకు తనను తాను తిట్టుకుని ఉండేవాడే. కాని ఇప్పుడతని ప్రక్క సుమిత్ర అతనికి ఆనుకుని కూర్చొని వుంది. అతని మనసు గాల్లో తేలి పోతూ ఉంది. మెత్తని ఆమె శరీర స్పర్శ వెచ్చని ఊహాలు రేపుతోంది. ఇద్దరూ సరదాగా నవ్వుతూ తుళ్ళుతూ ప్రయాణం సాగిస్తున్నారు. జీవితకాలం ఆప్రయాణం అలానే కొనసాగుతే బాగుంటుందని అనుకున్నాడు మాణిక్యారావు. మధ్య, మధ్య సుమిత్ర అతని భుజంతట్టి మాట్లాడుతుంటే మాణిక్యారావు ఏవో లోకాల్లోకి వెళ్ళిపోతున్నాడు. ఆమె చల్లని చిరునవ్వు, మెరిసే కళ్ళు, మెత్తని శరీరం అతన్ని పిచ్చివాడిని చేస్తున్నాయి.

సుమిత్ర కోరుకున్నంతగా తనను ఎవ్వరూ ఇంతవరకూ కోరలేదు. తనకు ఇంత చేరువగా ఎవరైనా వచ్చారా!.. నిజంగా సుమిత్రలాంటి ఆడది తనకు భార్యగా లభిస్తే?...తనకంత అదృష్టం ఉందా?...

ప్రయాణిస్తున్నంత సేపూ ఇలానే సాగాయి అతని ఆలోచనలు.

సాయంత్రం అయింది. ఇద్దరూ నిరుత్సాహపడే విధంగా రైలు విశాఖపట్నం చేరుకుంది. మాణిక్యరావు సుమిత్రను రిక్షా ఎక్కించి ఆమె చిరునామా డైరీలో వ్రాసుకుని ఆమె చేతిని తనచేతిలోకి తీసుకుని మళ్ళీ కలుస్తానని చెప్పి ఒక్కసారి చెయ్యి మెత్తగా నొక్కి వదిలేశాడు. రిక్షా కదిలింది. సుమిత్ర వెనక్కు వెనక్కు తిరుగుతూ మాణిక్యరావు వంక చూస్తూ చెయ్యి ఊపింది. ఆమె కనుమరుగయ్యే వరకూ చూసి తనూ రిక్షా మాట్లాడి అందులో కూలబడ్డాడు మాణిక్యరావు

మర్నాడు మాణిక్యరావు సుమిత్ర యింటికి వెళదామని అనుకున్నాడు కాని ఇతను ఊరినుండి వచ్చాడని తెలిసి స్నేహితులందరూ వస్తే, అతనికి వాళ్ళతో కాలక్షేపం జరిగిపోయింది.

ఆతరువాత మాణిక్యరావు పెళ్ళిచూపులకు బయలుదేరాడు. పెళ్ళికూతురు స్థానంలో సుమిత్రను చూసి ఆశ్చర్యపోయాడు. మెల్లగా తలెత్తి మాణిక్యరావు వంక చూసిన సుమిత్రకూడా ఆశ్చర్యం అంతకంటే అమితమైన ఆనందాన్ని అనుభవించింది. కొడుకు ముఖంలోని తృప్తినిచూసి మాణిక్యరావు తలిదండ్రులు కూడా సంతోషించారు. కనీసం ఇన్నాళ్ళకయినా అతనికి ఒకమ్మాయంటూ వచ్చిందని.

పెళ్ళిచూపులయిన మర్నాడే మాణిక్యరావు హైదరాబాదు ప్రయాణం అయిపోయాడు. సుమిత్రను కలుసుకోకుండా. బాగా ఆలోచించి అతను తన పెళ్ళి గురించి ఒక

నిర్ణయానికి వచ్చాడు. నాలుగు రోజుల తరువాత మాణిక్యా రావు దగ్గరనుండి అతని తలిదండ్రులకు ఒక ఉత్తరం వచ్చింది. తనకు సుమిత్ర నచ్చలేదంటూ ఉత్తరంలో అతను రాసింది చదివి అతని తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు. కలల లోకాల్లో తేలిపోతున్న సుమిత్రకు ఈ విషయం తెలిసి ఎంతగానో ఆశ్చర్య పోయింది—అంతకంటే ఎక్కువగా కృంగిపోయింది. మాణిక్యా రావు ప్రవర్తన ఆమెకు అంతుబట్టలేదు.

"ఒక అపరిచిత వ్యక్తితో తనకు చిక్కిన అవకాశాన్ని ఏ మాత్రం జారవిడువకుండా రైల్లో అంత విచ్చలవిడిగా ప్రవర్తించిందంటే ఆమె నడవడి ఎటువంటిదని అనుకోవాలి?" అని మాణిక్యరావు అనుకున్నాడని ఆమెకేం తెలుసు?

సుమిత్ర తనను నిష్కళంకమైన మనసుతో ప్రేమించిందని పాపం మాణిక్యరావుకు మాత్రం ఏం తెలుసు?

12-1-78, ఆంధ్రభూమి